

ఒంటి కాలిపై నిలబడి నిరసన

రేపల్లె: ప్రభుత్వం తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ మున్సిపల్ ఇంజినీరింగ్ కార్మికులు శనివారం కార్యాలయం వద్ద ఒంటి కాలిపై నిలబడి నిరసన తెలియజేశారు.



మంత్రి వినతుల స్వీకరణ

తెనాలి అర్బన్: రాష్ట్ర పౌర సరఫరాలశాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ శనివారం బోసు రోడ్డులోని క్యాంపు కార్యాలయంలో ప్రజల నుంచి వినతిపత్రాలు స్వీకరించారు.



వైద్య సిబ్బంది అవగాహన ర్యాలీ

నగరం: మండలంలోని ధూళిపూడిలో స్వచ్ఛ ఆంధ్ర– స్వర్ణ ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా పరిసరాల పరిశుభ్రతపై వైద్యారోగ్య సిబ్బంది అవగాహన ర్యాలీ నిర్వహించారు.

నాటి స్వచ్ఛత... నేడేదీ?

చెత్త నిర్వహణ అధ్వానంగా ఉన్నా కూటమి ప్రభుత్వం హడావుడి

- స్వచ్ఛభారత్ మిషన్ ద్వారా స్వచ్ఛ సర్వేక్షణ్ ర్యాంకులు
- గతంలో ర్యాంక్‌లు వచ్చి ఇప్పుడు బాగున్నందుకు సూపర్ స్వచ్ఛ లీగ్ నగరాలు ప్రకటన
- వాటిల్లో 3 నుంచి 10 లక్షల జనాభాలోపు నగరాల్లో గుంటూరు నగరపాలక సంస్థకు స్థానం
- 5 స్టార్ రేటింగ్‌తో ఓడీఎఫ్ ప్లస్ ప్లస్ సాధించామని మేయర్ ప్రకటన
- ప్రస్తుతం వీధుల్లోని చెత్త తరలింపులో అలసత్వం

సాక్షి గ్రౌండ్ రిపోర్ట్



జిల్లా టీడీపీ కార్యాలయం సమీపంలో రోడ్డుపై పేరుకుపోయిన చెత్త



బురద, మురుగుతో నిండిపోయిన మూడు వంతెనల బ్రిడ్జి ప్రాంతం (ఫైల్)

కేంద్ర ప్రభుత్వం స్వచ్ఛ భారత్ మిషన్ ద్వారా అందించే స్వచ్ఛ సర్వేక్షణ్ ర్యాంకుల్లో గుంటూరు నగర పాలక సంస్థకు చోటు దక్కింది. సూపర్ స్వచ్ఛ లీగ్ నగరాల జాబితాలో స్థానం పొందింది. గతంలో స్వచ్ఛతా అవార్డుల ఆధారంగా ఈ గుర్తింపు వచ్చింది. వాస్తవానికి ప్రస్తుతం నగరంలో పారిశుద్ధ్య నిర్వహణ అధ్వానంగా ఉంది. కూటమి ప్రభుత్వం మాత్రం గుంటూరు నగరాన్ని తీర్చిదిద్దామని, అవార్డు వచ్చిందని హడావుడి చేస్తోంది. పారిశుద్ధ్యం మెరుగుకు కనీస చర్యలూ లేవని ప్రజల నుంచి విమర్శలు వస్తున్నాయి.

నెహ్రూనగర్: స్వచ్ఛ సర్వేక్షణ్ ర్యాంకులను కేంద్ర ప్రభుత్వం 2014 నుంచి అమలు చేస్తోంది. నగరాలు, పట్టణాల్లో పరిశుభ్రత, పారిశుద్ధ్యాన్ని మెరుగుపరచడానికి వాటి మధ్య ఆరోగ్యకరమైన పోటీని ప్రోత్సహించడానికి కేంద్ర గృహ నిర్మాణం, పట్టణ వ్యవహారాల మంత్రిత్వ శాఖ ఈ అవార్డులను ప్రతి ఏడాది ప్రకటిస్తోంది. 2014 నుంచి స్వచ్ఛ సర్వేక్షణ్‌లో ర్యాంకుల్లో గుంటూరు నగరపాలక సంస్థకు ఆశించిన స్థాయిలో ర్యాంక్ రాలేదు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ పాలనలో ఈ ర్యాంకులను ప్రతిష్టాత్మకంగా తీసుకుని నగరాల్లో స్వచ్ఛతకు పెద్ద పీట వేశారు. అందులో భాగంగానే గుంటూరు నగరపాలక సంస్థ అన్ని అంశాల్లో మెరుగయ్యేలా ప్రత్యేక కార్యాచరణను నాటి సర్కారు రూపొందించింది. కేంద్రం 2023 సంవత్సరానికి ప్రకటించిన స్వచ్ఛ వాయు సర్వేక్షణ్ కింద గుంటూరు జాతీయ స్థాయిలో 3వ ర్యాంకు సాధించింది. స్వచ్ఛ సర్వేక్షణ్–2023లో గుంటూరు నగరపాలక సంస్థ చరిత్రలో ఎన్నడూలేని విధంగా జాతీయ స్థాయిలో అత్యుత్తమ ర్యాంక్‌లను సాధించి ఫాస్ట్ మూవింగ్ (వేగంగా అభివృద్ధి చెందుతున్న స్వచ్ఛ నగరాలు) సిటీల్లో జాతీయ స్థాయిలో 5 స్టార్ రేటింగ్స్‌తో 2వ ర్యాంక్, స్వచ్ఛ సర్వేక్షణ్ 2023లో 17వ ర్యాంక్ వచ్చింది. ఈ ర్యాంకుల ఆధారంగా నగరం ప్రస్తుతం స్వచ్ఛ సూపర్ లీగ్ నగరాల జాబితాలో ప్రత్యేకంగా చోటు దక్కించుకుంది.

డివిజన్‌కు ఒక ట్రాక్టర్ ఉన్నా..

గుంటూరు నగరంలో సుమారు 3 లక్షల గృహాలు ఉన్నాయి. వీటికి గాను నగరంలో 52 శానిటరీ డివిజన్లు , 802 మైక్రో ప్యాకెట్స్ ఉన్నాయి. రోజుకి నగరంలో ఉత్పన్నమయ్యే చెత్త 470 మెట్రిక్ టన్నులు. పనిచేసే కార్మికులు సుమారు 2,200 మంది మాత్రమే. నగరంలో చెత్త ఎక్కువగా ఉత్పన్నమవుతున్న దృష్ట్యా నగరపాలక సంస్థ అధికారులు 57 వార్డులకు 57 ట్రాక్టర్లు కేటాయించారు. అయితే ఈ ట్రాక్టర్లు కొన్ని అద్దె ప్రాతిపదికన తిప్పుతున్నారు. ఇలా తిరిగే ట్రాక్టర్లు కేవలం ఒకటి, రెండు ట్రిప్పులు వేసుకుని తూతూ మంత్రంగా చెత్త తరలించడంతో రోడ్ల వెంట వ్యర్థాలు పేరుకుపోతున్నాయి. ఓడీఎఫ్ ప్లస్ ప్లస్ అని చెప్పుకుంటున్న పాలకులు శివారులోని పలు ప్రాంతాల్లో కమ్యూనిటీ టాయిలెట్స్ లేకపోవడంతో ప్రజలు ఆరుబయటకు కాలకృత్యాలకు వెళుతున్న పరిస్థితిపై నోరు మెదపడం లేదు. ఇప్పటికైనా పాలకులు పారిశుద్ధ్యం మెరుగుకు, నగర అభివృద్ధికి చిత్తశుద్ధితో పనిచేయాలని ప్రజలు కోరుతున్నారు.



వర్షం పడితే కంకరగుంట అండర్ బ్రిడ్జి వద్ద దుస్థితి

నగరంలో ప్రజారోగ్య విభాగంలో పనిచేస్తున్న పారిశుద్ధ్య కార్మికులకు ఎటువంటి రక్షణ పరికరాలు ఇవ్వడం లేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. కార్మికులు రక్షణ పరికరాలు లేకుండానే కాలువల్లో దిగి పూడిక తీయాల్సిన పరిస్థితి నెలకొంది. వర్షం పడిన ప్రతిసారి మూడు వంతెనలు, కంకర గుంట బ్రిడ్జి కింద ఉన్న అండర్ పాస్ పూర్తిగా మురుగునీటిలో మునిగితోంది.

కార్మికులకు రక్షణ సామగ్రి కరువు

వీటిని ఇంజినీరింగ్ అధికారులు మోటార్లతో బెయిల్ అవుట్ చేస్తే ఆ తరువాత వచ్చిన మురుగును పారిశుద్ధ్య కార్మికులు రక్షణ పరికరాలు లేకుండా శుభ్రం చేయాల్సిన పరిస్థితి నెలకొంది. అధికారులు మాత్రం కార్మికులకు అవసరమైన పరికరాలు ఇస్తున్నామని ప్రచార ఆర్భాటాలకు పరిమితం అవుతున్నారు.

గుంటూరు నగరంలో పారిశుద్ధ్యం మెరుగు కోసం సకాలంలో చెత్త తరలించేందుకు గత ప్రభుత్వం క్లీన్ ఆంధ్రప్రదేశ్ (క్లాప్) కార్యక్రమం కింద 220 ఈ – ఆటోలు కేటాయించింది. అయితే వీటి నిర్వహణను కూటమి ప్రభుత్వం వచ్చాక గాలికొదిలేసింది.

ఈ – ఆటోలు నిరుపయోగం

ప్రస్తుతం 220 ఆటోలకు కేవలం 90 మాత్రమే రన్నింగ్‌లో ఉన్నాయి. మిగిలినవి బ్యాటరీ, గేర్ బాక్స్‌ల సమస్యలతో వెహికల్ షెడ్‌కే పరిమితం అయ్యాయి. వీటిని సక్రమంగా వినియోగిస్తే నగరంలో చెత్త సమస్య ఉండదని విశ్లేషకులు చెబుతున్నారు. నిర్వహణ పట్టించుకోకుండా చెత్త తరలించేందుకు ట్రాక్టర్లు అద్దె ప్రతిపాదికన తీసుకుని తమ జేబులు నింపుకొంటూ కొందరు కార్పొరేషన్ సొమ్మును కాజేస్తున్నారు.

న్యూస్‌రీల్

క్షణికావేశంతో జీవితాలు నాశనం



రేపల్లె: క్షణికావేశంలో చేసిన తప్పిదాలకు జీవితాన్ని కోల్పోవాల్సిన పరిస్థితులు నెలకొంటాయని మండల న్యాయ సేవాధికార సంస్థ అధ్యక్షురాలు, సీనియర్ సివిల్ జడ్జి ఎస్‌పీడీ వెన్నెల చెప్పారు. పట్టణంలోని సబ్‌జైలును శనివారం ఆమె పరిశీలించారు. జైలులో ఖైదీలకు అందుతున్న సేవలపై ఆరా తీశారు. ఖైదీలు సత్ప్రవర్తనతో కూడిన జీవితాన్ని అవలంబించటంతో మంచి జీవితం లభిస్తుందన్నారు. జైలులో ఖైదీలకు అందిస్తున్న ఆహారాన్ని, వసతులను, పరిసరాలను పరిశీలించారు. కార్యక్రమంలో అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి వి.గీతా భార్గవి, జైలు సిబ్బంది పాల్గొన్నారు.

శాకంబరిగా అమ్మవారు



బాపట్ల అర్బన్: ఆషాఢ మాసాన్ని పురస్కరించుకుని నందిరాజుతోటలోని గంగా పార్వతీ సమేత ఓంకార బ్రహ్మలింగేశ్వరస్వామి దేవాలయంలో శనివారం పార్వతి అమ్మవారు శాకంబరి అలంకారంలో భక్తులకు దర్శనం ఇచ్చారు. పలు కాయగూరలతో శోభాయమానంగా అలంకరించారు. భక్తులు పెద్దసంఖ్యలో దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. సాయంత్రం ఆరు గంటలకు ఆలయ ప్రధాన అర్చకులు శర్మ ఆధ్వర్యంలో అమ్మవారికి అంగరంగ వైభవంగా కుంకుమ పూజ నిర్వహించారు. యాభై మంది భక్తులు పాల్గొని, అమ్మవారి ఆశీస్సులు పొందారు.

565 అడుగులకు చేరిన సాగర్ నీటి మట్టం



విజయపురిసౌత్: నాగార్జునసాగర్ జలాశయ నీటి మట్టం శనివారం 565 అడుగులకు చేరింది. ఇది 244.1480 టీఎంసీలకు సమానం. సాగర్ జలాశయం నుంచి ఎస్‌ఎల్‌బీసీకి 1,800 క్యూసెక్కులు విడుదలవుతోంది. శ్రీశైలం నుంచి సాగర్ జలాశయానికి 67,800 క్యూసెక్కులు వచ్చి చేరుతోంది.

మోపిదేవి ఆలయంలో ఆర్వో ప్లాంట్లు ప్రారంభం



మోపిదేవి: స్థానిక శ్రీవల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామి దేవస్థాన ప్రాంగణంలో దివీస్ లేబొరేటరీస్ లిమిటెడ్ రూ.32 లక్షలతో ఏర్పాటు చేసిన రెండు ఆర్వో ప్లాంట్లను ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ శనివారం ప్రారంభించారు. దివీస్ ల్యాబ్ ప్రతినిధులు నగేష్, శ్రీనివాస్‌ను ఆలయ ఈఓ శ్రీరామవరప్రసాదరావు ఆధ్వర్యంలో వేద పండితులు ఘనంగా సత్కరించారు. ఆశీర్వచనాలు అందజేసి స్వామి చిత్రపటం బహూకరించారు.

దుర్గమ్మ సేవలో ప్రముఖులు



ఇంద్రకీలాద్రి: విజయవాడ దుర్గమ్మను విశ్రాంత ఐపీఎస్ అధికారి రమణకుమార్, ఐఏఎస్ అధికారి ఉదయలక్ష్మి శనివారం దర్శించుకున్నారు. అమ్మకు ప్రత్యేక పూజలు చేయించారు.

ముగిసిన పవిత్రోత్సవాలు



మోపిదేవి: మోపిదేవిలో వేంచేసిన శ్రీవల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వర స్వామి వారి పవిత్రోత్సవాలు ముగిశాయి. శనివారం ఉదయం పూర్ణాహుతి నిర్వహించారు.

సంక్షేమం పేరిట కూటమి మోసం



పార్టీ నాయకులతో కలిసి మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే శివకుమార్

- సంక్షేమ పథకాలు లేవు... చేసిన అభివృద్ధి కూడా శూన్యం
- అన్నిరకాలుగా ప్రజలను మోసగించిన పాలకులు
- మంత్రి మనోహర్‌పై మాజీ ఎమ్మెల్యే శివకుమార్ ధ్వజం

తెనాలి: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం కన్నా మిన్నగా సంక్షేమం అందిస్తామని ఎన్నికల్లో హామీనిచ్చి అధికారంలోకి వచ్చిన ఏడాది తర్వాత 'జగన్‌కన్నా ఎక్కువ బటన్‌లు నొక్కుతామని ప్రజలు మాకు ఓటు వేయలేదు' అంటూ రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ చెప్పటం ప్రజలను మోసగించటమేనని ఆ పార్టీ తెనాలి సమన్వయకర్త, మాజీ ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ అన్నారు. అటు సంక్షేమాన్ని ఇవ్వకుండా, ఇటు అభివృద్ధి చేయకుండా ప్రజలు పెట్టుకున్న నమ్మకాన్ని వమ్ము చేశారని విమర్శించారు. స్థానిక గంగానమ్మపేటలోని పార్టీ కార్యాలయంలో శనివారం విలేకరుల సమావేశంలో పార్టీ నాయకులతో కలిసి మాజీ ఎమ్మెల్యే శివకుమార్ మాట్లాడారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇటీవలి ప్రెస్‌మీట్‌పై మంత్రి మనోహర్ చేసిన వ్యాఖ్యలను ఖండించారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం పేదరికం నిర్మూలనకు అత్యధిక ప్రాధాన్యతను ఇచ్చిందన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీలతోపాటు అగ్రవర్ణాల్లోని పేదలకు అయిదేళ్లలో రూ.2.85 లక్షల కోట్ల సంక్షేమాన్ని నేరుగా వారి ఖాతాల్లో వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి జమచేశారని గుర్తుచేశారు. అధికారంలోకి వచ్చి 14 నెలల తర్వాత ఇప్పుడు బటన్ నొక్కుతామని ప్రజలు ఓటేయలేదనటం దారుణమన్నారు.

పథకాల అమలులో దగా

ఇంట్లో ఎంతమంది చదువుకునే పిల్లలుంటే అంత మందికి తల్లికి వందనం పథకం హామీ, ఏడాదిలో మూడు గ్యాస్ సిలిండర్ల హామీలు అరకొరగా ఎలా ఇచ్చిందీ వీడియో సాక్ష్యాలతో శివకుమార్ బహిర్గతం చేశారు. రాష్ట్ర మంత్రిగా ఉండి మీరు తెనాలికి ఏం చేశారని శివకుమార్ ప్రశ్నించారు. చెంచుపేట ఓవర్‌బ్రిడ్జి పునర్నిర్మాణం, రేపల్లె గేటు, పినపాడు గేటు వద్ద రైల్‌ఓవర్ బ్రిడ్జిని నిర్మించాలని సూచించారు. తెనాలిని రాజధానిలో చేర్చాలని, తెనాలిలో రెండు ఐటీ కంపెనీలను ఏర్పాటు చేయాలని కోరారు. పట్టణంలో రోడ్లు అధ్వానంగా ఉండటానికి గతంలో తీసుకొచ్చిన మంచినీటి పథకం లీకేజీలే ప్రధాన కారణమన్నారు. సమావేశంలో పార్టీ పట్టణ, రూరల్ మండలం, కొల్లిపర మండలం అధ్యక్షులు దేసు శ్రీనివాసరావు, చెన్నుబోయిన శ్రీనివాసరావు, కళ్లం వెంకట ప్పారెడ్డి, పార్టీ ఇతర నాయకులు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శుల నియామకం



నిమ్మకాయల రాజనారాయణ



మందపాటి శేషగిరిరావు



షేక్ గులాంరసూల్

పట్నంబజారు: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు గుంటూరు జిల్లాకు సంబంధించి పలువురిని రాష్ట్ర కార్యదర్శులుగా (పార్లమెంట్) నియమిస్తూ ఆదేశాలు జారీ చేశారు. ఈ మేరకు శనివారం కేంద్ర పార్టీ కార్యాలయం నుంచి ఉత్తర్వులు వెలువడ్డాయి. గుంటూరు జిల్లాకు చెందిన నిమ్మకాయల రాజనారాయణ, మందపాటి శేషగిరిరావు, షేక్ గులాంరసూల్‌లను రాష్ట్ర కార్యదర్శులుగా నియమించారు. గుంటూరు పార్లమెంట్ జిల్లా పరిధిలోని అసెంబ్లీ నియోజకవర్గాలను వీరికి కేటాయించటం జరుగుతుందని తెలిపారు. వీరు పార్టీ కేంద్ర కార్యాలయంతో సమన్వయం చేసుకుంటూ సంబంధిత రీజినల్ కోఆర్డినేటర్‌లు, పార్లమెంట్ నియోజకవర్గ పరిశీలకులకు సహాయసహకారాలు అందిస్తారని తెలిపారు.

ఆర్టీఐ రాష్ట్ర వర్కింగ్ అధ్యక్షుడిగా అవుతు శ్రీధర్‌రెడ్డి

పట్నంబజారు: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు గుంటూరు జిల్లాకు చెందిన అవుతు శ్రీధర్‌రెడ్డిని పార్టీ ఆర్టీఐ విభాగం రాష్ట్ర వర్కింగ్ అధ్యక్షులుగా నియమిస్తూ ఆదేశాలు జారీ అయ్యాయి. కేంద్ర పార్టీ కార్యాలయం నుంచి ఈ ఉత్తర్వులు వెలువడ్డాయి.

ఫ్లయ్ ఓవర్ పనులను పరిశీలించిన కేంద్ర మంత్రి



గుంటూరు వెస్ట్: నగరంలోని శంకర్ విలాస్, నంది వెలుగు రోడ్డులోని ఫ్లయ్ ఓవర్‌ల నిర్మాణ స్థితిగతులను శనివారం కేంద్ర పట్టణాభివృద్ధి, కమ్యూనికేషన్ల శాఖ సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ పరిశీలించారు. అధికారులను అడిగి వివరాలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా పెమ్మసాని మాట్లాడుతూ.. కూటమి ప్రభుత్వ హయాంలో రూ.98 కోట్ల ఎస్టిమేషన్‌తో శంకర్‌విలాస్ బ్రిడ్జ్‌ను అత్యాధునికంగా నిర్మిస్తున్నామని పేర్కొన్నారు. మణిపురం వంతెన పనులను మళ్లీ ప్రారంభించామన్నారు. ప్రజలకు రానున్న కాలంలో మెరుగైన రవాణా సేవలు అందించేందుకు కృషి చేస్తున్నామని తెలిపారు. మరోవైపు ట్రాఫిక్ పరంగా ఇబ్బందులు లేకుండా అధికారులు వీలైనంత వరకు పలు చర్యలు తీసుకుంటున్నారు. ఈ కార్యక్రమంలో నగర మేయర్ కోవెలమూడి రవీంద్ర, తూర్పు నియోజకవర్గ ఎమ్మెల్యే మొహమ్మద్ నసీర్ అహ్మద్, జనసేన పార్టీ జిల్లా అధ్యక్షుడు గాదె వెంకటేశ్వరరావు, ఆర్ అండ్ బీ ఎస్ఈ శ్రీనివాస మూర్తి తదితరులు పాల్గొన్నారు.

పాలిథిన్ వినియోగం, విక్రయాలపై కఠిన చర్యలు



స్వచ్ఛ ప్రతిజ్ఞ చేస్తున్న కమిషనర్ పులి శ్రీనివాసులు, అధికారులు

నెహ్రూనగర్: స్వచ్ఛ గుంటూరులో భాగంగా నగరంలో సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వినియోగం, విక్రయం నిషేధానికి కఠిన చర్యలు తీసుకుంటామని నగర మేయర్ కోవెలమూడి రవీంద్ర చెప్పారు. స్వర్ణాంధ్ర – స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా శనివారం బృందావన్ గార్డెన్స్‌లోని ఎన్టీఆర్ మున్సిపల్ స్టేడియం నుంచి లాడ్జి సెంటర్ వరకు ర్యాలీ, మానవహారం, స్వచ్ఛ ప్రతిజ్ఞ, స్టేడియంలో క్లాత్ వెండింగ్ మెషిన్ ప్రారంభ కార్యక్రమాల్లో నగర మేయర్ కోవెలమూడి రవీంద్ర, కమిషనర్ పులి శ్రీనివాసులు, గుంటూరు డివిజనల్ రైల్వే మేనేజర్ (డీఆర్‌ఎం) సుదేష్ట సేన్, పశ్చిమ నియోజకవర్గ శాసనసభ్యులు గల్లా మాధవి, డిప్యూటీ మేయర్ షేక్ సజీల పాల్గొన్నారు. మేయర్ మాట్లాడుతూ ప్లాస్టిక్ కవర్లకు ప్రత్యామ్నాయంగా గుడ్డ సంచులను అందించే వెండింగ్ మెషిన్లను గాంధీ పార్క్, ఎన్టీఆర్ స్టేడియంల దగ్గర ఏర్పాటు చేశామన్నారు. డీఆర్‌ఎం మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు స్వచ్ఛతకు అధిక ప్రాధాన్యత ఇస్తున్నాయని, ఆ స్ఫూర్తితో గుంటూరు డివిజన్ పరిధిలోని రైల్వే స్టేషన్లలో కూడా స్వచ్ఛతకు రైల్వే శాఖ చర్యలు తీసుకుంటుందన్నారు. తొలుత ఎన్టీఆర్ స్టేడియంలో పశ్చిమ ఎమ్మెల్యే గల్లా మాధవి నగరపాలక సంస్థ ఏర్పాటు చేసిన రూ.20కే క్లాత్ బ్యాగ్ ఇచ్చే వెండింగ్ మెషిన్‌ని, అవగాహన ర్యాలీని జెండా ఊపి ప్రారంభించారు. అనంతరం లాడ్జి సెంటర్‌లో మానవహారం చేపట్టి, స్వచ్ఛత ప్రతిజ్ఞ చేశారు. జీఎంసీ అదనపు కమిషనర్ చల్లా ఓబులేసు, ఏడీఆర్‌ఎం రమేష్ కుమార్, సీనియర్ డీపీఓ షహబాజ్, డీఎంహెచ్‌ఓ డాక్టర్ విజయలక్ష్మి, కార్పొరేటర్లు పాల్గొన్నారు.



ర్యాలీ నిర్వహిస్తున్న అధికారులు

విద్యార్థులకు అవస్థలు

నగరపాలక సంస్థ చేపట్టిన స్వర్ణాంధ్ర – స్వచ్ఛాంధ్ర కార్యక్రమం కోసం నగరంలోని పలు స్కూళ్ల నుంచి విద్యార్థులను ర్యాలీ కోసం సమీకరించారు. ఉదయం 7గంటలకు విద్యార్థులను రమ్మని అధికారులు చెప్పడంతో ఆ సమయానికి వచ్చేశారు. అధికారులు, ప్రజా ప్రతినిధులు తీరికగా ఉదయం 9 గంటలకు వచ్చారు. అప్పటికే ఎండ తీవ్రత ఎక్కువగా ఉండటంతో విద్యార్థులు ఇబ్బందులు పడ్డారు.



ఉత్సవంలో పాల్గొన్న భక్తులు

భగవతి పద్మావతి అమ్మవారికి సారె

తెనాలి టౌన్: రూరల్ మండలం బుర్రిపాలెం గ్రామంలో వేంచేసియున్న శ్రీ పరంజ్యోతి భగవతి పద్మావతి అమ్మవారికి శనివారం ఆషాడ మాస సారె సమర్పించారు. అమ్మవారిని శ్రీ శాకంబరి దేవిగా అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. తెనాలి, పరిసర ప్రాంతాల నుండి భక్తులు విశేష సంఖ్యలో తరలివచ్చి సారె సమర్పించారు. అనంతరం ఆలయ కమిటీ సభ్యులు అన్నప్రసాద వితరణ చేశారు. భక్తుల కోర్కెలు తీర్చే అమ్మవారిని దర్శించుకుని భక్తులు తన్మయం చెందారు. ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.



శాకంబరి అలంకరణలో భగవతి పద్మావతి అమ్మవారు

ఎల్ఐసీ జోనల్ క్యారమ్స్ టోర్నీ న్యాయ నిర్ణేతగా జలీల్


అబ్దుల్ జలీల్

గుంటూరు వెస్ట్ (క్రీడలు): గుంటూరుకు చెందిన ప్రముఖ క్యారమ్స్ క్రీడాకారుడు ఏపీ క్యారమ్స్ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి షేక్ అబ్దుల్ జలీల్‌ను ఎల్ఐసీ సౌత్ సెంట్రల్ జోన్ క్యారమ్స్ సెలక్షన్స్ ట్రయల్స్ 2025–26కు గాను ముఖ్య న్యాయ నిర్ణేతగా నియమిస్తూ శనివారం ఉత్తర్వులు జారీ అయ్యాయి. దీంతోపాటు ఆయన జోనల్ క్యారమ్స్ సెలక్షన్స్ కమిటీ సభ్యునిగానూ ఎంపికయ్యారు. రాష్ట్రంలో జలీల్‌కు మాత్రమే ఇటువంటి అవకాశం దక్కింది. జలీల్ ఇప్పటికే అంతర్జాతీయ రిఫరీగానూ, జాతీయ క్యారమ్స్ ప్యానెల్ కోచ్‌గానూ వ్యవహరిస్తున్నారు. ఈ సందర్భంగా జలీల్‌కు ఆల్ ఇండియా క్యారమ్స్ సంఘం సీనియర్ ఉపాధ్యక్షుడు డాక్టర్ నీరజ్ కుమార్ సంపతి, ఏపీ క్యారమ్స్ సంఘం చీఫ్ ప్యాట్రన్ యాగంటి దుర్గారావు, జిల్లా అధ్యక్షుడు ఎంకేవీ ప్రసాద్, సెలక్షన్ కమిటీ సభ్యులు పి.శ్రీనివాసరావులు అభినందనలు తెలిపారు.

కొల్లిపరలో 98.6 మి.మీ. వర్షపాతం

కొరిటెపాడు (గుంటూరు): గుంటూరు జిల్లాలో శుక్రవారం ఉదయం నుంచి శనివారం ఉదయం వరకు అత్యధికంగా కొల్లిపర మండలంలో 98.6 మిల్లీ మీటర్ల వర్షపాతం పడగా, అత్యల్పంగా మంగళగిరి మండలంలో 0.8 మి.మీ. పడింది. సగటు 15.3 మి.మీ.గా నమోదైంది. ప్రత్తిపాడు మండలంలో 61.2, పెదకాకాని 24.2, గుంటూరు పశ్చిమ 20.2,దుగ్గిరాలలో 16.4మి.మీ కురిసింది.

ప్రభుత్వ తీరుపై పసుపు రైతుల ఆగ్రహం

- కోల్డ్ స్టోరేజీ అగ్ని ప్రమాద బాధితులకు క్వింటాకు రూ.7 వేలు ఇవ్వాలి
- బీమా పరిహారంతో సరిపెడితే ఎలాగని అన్నదాతల మండిపాటు
- మంత్రి ఇచ్చిన హామీ ప్రకారం నగదు కూడా చెల్లించాలని వినతి


సబ్ కలెక్టర్ కార్యాలయం ఎదుట నినాదాలు చేస్తున్న రైతులు

తెనాలి: దుగ్గిరాలలోని శుభం మహేశ్వరి కోల్డ్ స్టోరేజ్‌లో గతేడాది జనవరిలో దగ్ధమైన పసుపు రైతులకు వచ్చిన మొదటి విడత బీమా పరిహారం సరిపోదని, రాష్ట్ర మంత్రి అచ్చెన్నాయుడు గతంలో ఇచ్చిన హామీ ప్రకారం క్వింటాకు రూ.7 వేలు చొప్పున ఇవ్వాల్సిందేనని బాధిత పసుపు రైతులు డిమాండ్ చేశారు. తొలి విడత బీమా పరిహారం వచ్చిన నేపథ్యంలో సబ్‌కలెక్టర్ వి.సంజనా సింహను శనివారం బాధిత రైతులు కలిశారు. గుంటూరులో కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ ఈ బీమా పరిహారం చెక్కును అందజేస్తారని సబ్‌కలెక్టర్ వారికి చెప్పారు. రైతులు మాత్రం తమకు బీమాతో పాటు క్వింటాకు రూ.7 వేల చొప్పున సాయం కూడా ఒకేసారి వచ్చేలా చూడాలని కోరారు. మార్కెటింగ్ శాఖ అధికారి, దుగ్గిరాల పసుపు యార్డు కార్యదర్శి కూడా అక్కడకు వచ్చారు. మార్కెటింగ్ శాఖ జాయింట్ డైరెక్టర్‌తో మాట్లాడి తమ సమస్యకు పరిష్కారం చూపాలని రైతులు కోరారు. ఫోనులో ప్రయత్నించినా అందుబాటులోకి రావటం లేదని చెప్పి మార్కెటింగ్ అధికారులు వెళుతుండగా, రైతులు ఆందోళన చేశారు. బీమా పరిహారం వరకు తీసుకుంటే అప్పులవాళ్లు తమ వెంటబడతారని, అరకొరా డబ్బులతో అందరికీ సర్దుబాటు చేయటం సాధ్యం కాదన్నారు. ఇబ్బందులు పడతామని తమ గోడు వెళ్లబోసుకున్నారు. తమకు న్యాయం చేయాలని, మంత్రి ఇచ్చిన హామీ ప్రకారం డబ్బులు ఇవ్వాలని సబ్ కలెక్టర్ కార్యాలయం ఎదుట నినాదాలు చేశారు. తమలో తాము చర్చించుకున్న అనంతరం రైతులు గుంటూరు వెళ్లి మంత్రి పెమ్మసానితో మాట్లాడి తేల్చుకుందామని బయలుదేరారు.

సీఏలకు పుష్కల అవకాశాలు

ఐసీఏఐ ఉపాధ్యక్షుడు ప్రసన్న కుమార్


సమావేశంలో మాట్లాడుతున్న ప్రసన్న కుమార్

గుంటూరు ఎడ్యుకేషన్: చార్టర్డ్ అకౌంటెంట్లు (సీఏ)లకు దేశ వ్యాప్తంగా డిమాండ్ నెలకొని ఉందని ఇనిస్టిట్యూట్ ఆఫ్ చార్టర్డ్ అకౌంటెంట్స్ ఆఫ్ ఇండియా (ఐసీఏఐ) ఉపాధ్యక్షుడు డి.ప్రసన్నకుమార్ అన్నారు. ఐసీఏఐ గుంటూరు చాప్టర్ ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన సీఏ విద్యార్థుల సదస్సులో పాల్గొనేందుకు వచ్చిన ప్రసన్నకుమార్ మీడియా సమావేశంలో మాట్లాడారు. సీఏ కోర్సులు అభ్యసిస్తున్న విద్యార్థుల్లో నాయకత్వ లక్షణాలు పెంపొందించేందుకు ఐసీఏఐ కృషి చేస్తోందన్నారు. గుంటూరులో సీఏ విద్యార్థుల కోసం ఐసీఏఐ భవన్‌ను ఆధునిక వసతులతో నిర్మిస్తున్నామని తెలిపారు. సీఏ కోర్సుల విద్యార్థులకు ఐసీఏఐ స్టైఫండ్ ఇస్తోందన్నారు. సమావేశంలో ఐసీఏఐ వైస్ ప్రెసిడెంట్ డి.ప్రసన్నకుమార్, సదరన్ ఇండియా రీజినల్ కౌన్సిల్ వైస్ చైర్మన్ ముప్పాళ్ల సుబ్బారావు, కార్యదర్శి ఎన్.రాజశేఖర్, గుంటూరు బ్రాంచి చైర్మన్ చింతా రఘునందన్, వైస్ చైర్మన్ బి.ఝాన్సీ లక్ష్మి, కార్యదర్శి వనిమిరెడ్డి వి. నరేష్ తదితరులు పాల్గొన్నారు.

ఇంజినీరింగ్ విద్య ఒక్కటే గమ్యం కాదు

జేఎన్‌టీయూకే వీసీ డాక్టర్ చేకూరి శివరామకృష్ణప్రసాద్


నగదు ప్రోత్సాహకాలు అందుకున్న విద్యార్థులతో అతిథులు

తెనాలి: విద్యార్థులకు ఇంజినీరింగ్ విద్య ఒక్కటే గమ్యం కాదనీ.. అది లేకపోతే జీవితం వ్యర్థం అనే భావనలను ముందుగా తల్లిదండ్రులు విడనాడాలని కాకినాడ జేఎన్‌టీయూకే వైస్ చాన్స్‌లర్ డాక్టర్ చేకూరి శివరామకృష్ణప్రసాద్ అన్నారు. పట్టణానికి చెందిన మొవ్వా విజయలక్ష్మి స్మారక సేవాసమితి ఆధ్వర్యంలో శనివారం తెనాలి రామకృష్ణకవి కళాక్షేత్రంలో ఏర్పాటైన సభకు సంస్థ వ్యవస్థాపకుడు మొవ్వా సత్యనారాయణ అధ్యక్షత వహించారు. మొవ్వా విజయలక్ష్మి స్మారక నాలుగో అవార్డును తెనాలికి చెందిన హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ డాక్టర్ వెంకట జ్యోతిర్మయి ప్రతాపకు బహూకరించారు. ఇదే సభలో గత మార్చిలో జరిగిన పదోతరగతి పరీక్షల్లో 550, ఆపైన మార్కులు సాధించిన 60 మంది ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు రూ.5 వేల చొప్పున రూ.3 లక్షల నగదు ప్రోత్సాహకాలు, జ్ఞాపికలను అందజేశారు. ముఖ్యఅతిథి డాక్టర్ శివరామకృష్ణప్రసాద్ మాట్లాడుతూ ఇంజినీరింగ్ కోర్సులు పూర్తిచేసుకుని బయటకు వచ్చేవారిలో 15 శాతం మాత్ర మే ఉద్యోగాలకు అర్హులని నివేదికలు చెబుతుంటే లోపం ఎవరిదని ప్రశ్నించారు. ఇంజినీరింగ్‌లో 1.90 లక్షల కన్వీనర్ సీట్లుంటే 1.40 లక్షలు కూడా భర్తీకావటం లేదన్నారు. తహసీల్దార్ కేవీ గోపాలకృష్ణ మాట్లాడారు.

విద్యార్థుల చేతుల్లోనే బంగారు భవిష్యత్తు

డాక్టర్ వంగల శ్రీనివాస్ మాట్లాడుతూ విద్యార్థులు సరైన రీతిలో వాడుకుంటే సెల్‌ఫోన్ బ్రహ్మాస్త్రమని సోదాహరణంగా చెప్పారు. దళిత సార్వత్రిక విశ్వవిద్యాలయం ఉపకులపతి ఆచార్య గుజ్జర్లమూడి కృపాచారి తన ప్రసంగంలో బంగారు భవిష్యత్ మీ చేతుల్లోనే ఉందని విద్యార్థుల నుద్దేశించి అన్నారు. ఏఎస్ఎన్ డిగ్రీ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ కొలసాని రామ్‌చంద్ మాట్లాడుతూ, మాతృభాషలో సౌమ్యంగా మాట్లాడటం, చుట్టూ ఉన్న అందరితో సత్సంబంధాలు కొనసాగించటం, చేసే ప్రతిపనికి ఎవరికివారు బాధ్యత వహించటం అలవాటు చేసుకుంటే ఏ టెక్నాలజీ వచ్చినా ఇబ్బంది ఉండదన్నారు. డ్రగ్స్, ఆల్కహాలు, ప్రేమ వ్యవహారాలకు దూరంగా ఉండాలని సూచించారు. తొలుత బెల్లంకొండ వెంకట్ స్వాగతం పలికారు.

ఘనంగా బ్యాంకుల జాతీయీకరణ దినోత్సవం


మాట్లాడుతున్న పి.కిషోర్‌కుమార్, బాషా, మురళీ తదితరులు

కొరిటెపాడు(గుంటూరు): బ్యాంకుల జాతీయీకరణ దినోత్సవాన్ని మార్కెట్ సెంటర్‌లోని యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా బ్రాంచి వద్ద శనివారం ఘనంగా నిర్వహించారు. తొలుత జిల్లా బ్యాంక్ ఉద్యోగ సంఘాల కార్యదర్శి బాషా పతాకాన్ని ఆవిష్కరించారు. యూనియన్ సలహాదారు పి.కిషోర్ కుమార్ మాట్లాడుతూ బ్యాంకులు 1969 జూలై 19న బ్యాంకులు జాతీయమై, దేశ ఆర్థిక వ్యవస్థకు వెన్నెముకగా నిలబడ్డాయన్నారు. 1991 తర్వాత ఆర్థిక సంస్కరణల పేరుతో ప్రాధాన్య రంగాలను పక్కనపెట్టి కార్పొరేట్ శక్తులకు అధిక రుణాలు ఇవ్వడం, అవి తిరిగి కట్టకపోవడంతో బ్యాంకులలో నిరర్థక ఆస్తులు పెరిగి బ్యాంకు లాభాలన్నీ కూడా వాటికి సర్దుబాటు చేయడం వలన బ్యాంకుల ఆదాయం ఆవిరైపోతుందని విమర్శించారు. నాడు బ్యాంకుల జాతీయీకరణను వ్యతిరేకించారో వారే నేడు అధికారంలో ఉండడం అనేది ప్రభుత్వరంగ బ్యాంకుల ఉనికికి ప్రమాదకరమని హెచ్చరించారు. బ్యాంకుల ప్రైవేటీకరణకు చేసే ప్రయత్నాలను వ్యతిరేకిస్తూ ఉద్యమాలు చేపట్టాలని ఆయన పిలుపునిచ్చారు. బ్యాంక్ ఉద్యోగ సంఘం నాయకులు మురళీ, షరీఫ్, పృథ్వీ, క్రాంతి, సీపీఐ నాయకుడు పి.శివాజీ తదితరులు పాల్గొన్నారు. అనంతరం గుంటూరు శ్రీనగర్‌లోని మాతృశ్రీ వృద్ధాశ్రమంలో వృద్ధులకు అల్పాహారం, మధ్యాహ్నం భోజనం ఏర్పాట్లు చేశారు.

రోగులకు మెరుగైన సేవలందించండి

సెకండరీ హెల్త్ విభాగం రాష్ట్ర జాయింట్ కమిషనర్ డాక్టర్ ఎస్.రమేష్‌నాథ్


రోగులతో మాట్లాడుతున్న డాక్టర్ రమేష్‌నాథ్

తెనాలిఅర్బన్: తెనాలి జిల్లా వైద్యశాలలో పారిశుద్ధ్య నిర్వహణను కొంత మెరుగుపరచాల్సిన అవసరం ఉందని, ప్రతి రోజు వైద్యులు, సిబ్బంది ఈ విషయమై దృష్టి సారించాలని సెకండరీ హెల్త్ విభాగం రాష్ట్ర జాయింట్ కమిషనర్ డాక్టర్ ఎస్.రమేష్‌నాథ్ ఆదేశించారు. తెనాలి జిల్లా వైద్యశాల, తల్లిపిల్లల వైద్యశాలలను శనివారం ఆయన పరిశీలించారు. వైద్యశాలలోని ఓపీని పరిశీలించి రోగులతో మాట్లాడారు. వారికి అందుతున్న వైద్యసేవలపై ఆరా తీశారు. అనంతరం ల్యాబ్‌లను, వార్డులను తనిఖీ చేసి రికార్డులు పరిశీలించారు. సీటీ స్కాన్ యూనిట్ నిరుపయోగంగా ఉండటాన్ని గమనించిన ఆయన నూతన మిషన్ ఏర్పాటుకు ప్రతిపాదనలు పంపాలని సూచించారు. అలాగే ఈఎన్‌టీ ఆపరేషన్‌లకు సంబంధించిన మైక్రోస్కోప్ యంత్రాన్ని మంజూరు చేయించే విధంగా చూస్తామని హామీ ఇచ్చారు. నవంబర్‌లో వైద్యుల పదోన్నతులు ఉన్నాయని అవి పూర్తి అవగానే తెనాలిలో ఖాళీగా ఉన్న ఫోరెన్సిక్, సైక్రాటిక్ వైద్యుల పోస్టులను భర్తీ చేసే అవకాశం ఉందని చెప్పారు. జిల్లా సమన్వయ అధికారి డాక్టర్ బీవీ రంగారావు, వైద్యశాల ఇన్‌ఛార్జి సూపరింటెండెంట్ డాక్టర్ రామాంజనరావు, సీనియర్ వైద్యులు డాక్టర్ జె.హనుమంతరావు, అసిస్టెంట్ ఆర్ఎంఓ డాక్టర్ సురేష్, నర్సింగ్ సూపరింటెండెంట్ రాజేశ్వరి, పలువురు వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఫీజు రీయింబర్స్‌మెంట్ రూ.600 కోట్లు ఎక్కడ?

ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నాసర్ జీ

లక్ష్మీపురం: రాష్ట్ర ప్రభుత్వం రూ.600 కోట్ల ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు విడుదల చేస్తుందని ఈనెల 12వ తేదీన విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ ప్రకటించారని, వారం రోజులు గడుస్తున్నా ఇంత వరకు ఇంతవరకు ఒక్క విద్యార్థి ఖాతాలో నగదు జమకాలేదని, మరి 600 కోట్లు ఎక్కడికి వెళ్లాయని ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బందెల నాసర్ జీ ప్రశ్నించారు. గుంటూరు కొత్తపేటలోని సీపీఐ జిల్లా కార్యాలయంలోని మల్లయ్య లింగం భవన్‌లో అఖిల భారత విద్యార్థి సమాఖ్య(ఏఐఎస్ఎఫ్) నాయకులు శనివారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా పెండింగ్లో ఉన్న రూ.6,400 కోట్ల ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ బకాయిలను విడుదల చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు విడుదల కాకపోవడం వలన దాదాపు 10 లక్షల మంది విద్యార్థులు తమ డిగ్రీలు, పీజీలు పూర్తి చేసుకుని సర్టిఫికెట్లు లేక ఇబ్బందులు పడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు.